సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం ׀ 21 ׀ ఫిబ్రవరి ׀ 2023



పోటీతత్వంతో ప్రతిభకు పదును

అంతర్గతంగా దాగి ఉండే ప్రతిభ పోటీతత్వంతో మెరుగవుతుందని సింగరేణి మణుగూరు ఏరియా జీఎం రాంచందర్ అన్నారు. 10లో



ఇల్లెందు కళాశాలకు 'బీ ప్లస్'

ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గ్రేడ్ మెరుగుపడింది. మూడో దఫాలో 2.63 పాయింట్లతో 'బీ ప్లస్' గ్రేడ్ సాధించింది. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 20°

వాతావరణం

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మంగళవారం ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

శ్రీరామ నవమి వేడుకలపై నేడు సమీక్ష

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో వచ్చే నెల 30, 31 తేదీల్లో నిర్వహించే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమావేశం జరిపి ఉత్సవాల విజవయంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

ఎంపీఓల సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీలను ఆవిష్కరిస్తున్న డీపీఓ తదితరులు

చుంచుపల్లి: మండల పంచాయతీ అధికారుల సంఘం డైరీని జిల్లా పంచాయతీ అధికారి లక్కినేని లక్ష్మీ రమాకాంత్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, మండలాల అభివృద్ధిలో నిరంతరం శ్రమిస్తున్న ఎంపీఓల సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమణారావు, ఎంపీఓల సంఘం నాయకులు గుంటి సత్యనారాయణ, ఖాన్, నారాయణ, లక్ష్మయ్య, కుమార్ పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో ఐటీఐ అభ్యర్థులకు వర్క్‌షాప్

కొత్తగూడెంఅర్బన్: ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి అప్రెంటిస్‌పై ఈనెల 24, 25 తేదీల్లో అవగాహన వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న క్రాస్‌రోడ్డు సమీపంలోని సింగరేణి ఇల్లెందు గెస్ట్ హౌస్‌లో, 25న ప్రభుత్వ ఐటీఐ కళాశాల క్యాంపస్‌లో ఉంటుందని వివరించారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోలీస్ జాగిలాలకు పతకాలు



పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: నార్కోటిక్ విభాగంలో శిక్షణ పొందిన జిల్లా పోలీసు జాగిలాలు గ్రేసీ, రీనా స్వర్ణ, రజత పతకాలు గెలుచుకున్నాయి. తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన పోలీసు జాగిలాలకు గతేడాది జూన్ నుంచి ఈనెల 16 వరకు మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రెనింగ్ అకాడమీలో శిక్షణ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన పరీక్షల్లో జిల్లాకు చెందిన జాగిలాలు గ్రేసీ బంగారు, రీనా వెండి మెడల్స్ సాధించాయి. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. పోలీసు జాగిలాల సంరక్షణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పతకాలు సాధించిన జాగిలాలను అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి. సాయి మనోహర్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌బాబు, ఆర్‌ఐలు దామోదర్, సోములు, ఏఆర్ ఎస్సైలు పెంటోజీరావు, హెడ్ కానిస్టేబుల్ నాగుల్‌మీరా(రీనా హ్యాండ్లర్), కానిస్టేబుల్ వెంకటేష్ (గ్రేసీ హ్యాండ్లర్) పాల్గొన్నారు.

తుక్కు.. తక్కువేం కాదు

స్క్రాప్ రూపంలో కేటీపీఎస్ సామగ్రి వేలం

- టీఎస్ జెన్‌కోకు రూ.485 కోట్ల ఆదాయం
- 2020లో మూతబడిన పాత ప్లాంట్లు
- తుక్కు కొనుగోలుకు ముందుకొచ్చిన ముంబై సంస్థ
- గత నెలలో మొదలైన తొలగింపు పనులు
- మూడేళ్లలో ఆనవాళ్లు మాయం



కేటీపీఎస్ ఓఅండ్‌ఎంలో విడి భాగాలను తొలగిస్తున్న సిబ్బంది



త్వరలో తొలగించనున్న పాత ప్లాంట్ కర్మాగారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌లో కాలం చెల్లిన, ప్రస్తుతం వినియోగంలో లేని పాత విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను తుక్కు కింద అమ్మేయడం ద్వారా టీఎస్ జెన్కోకు భారీగా ఆదాయం రానుంది. దీంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా స్థల లభ్యత పెరగనుంది.

స్వాతంత్య్రం వచ్చిన కొత్తలో దేశ పారిశ్రామిక, గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. ఈ క్రమంలో 1966 సెప్టెంబర్ 4న పాల్వంచలో తొలి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని 60 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ఈ ప్లాంటు నిర్మాణానికి జపాన్ సాంకేతిక సహాయం అందించగా రూ.59.29 కోట్లు ఖర్చయింది. ఆ తర్వాత వరుసగా బీ, సీ యూనిట్ల నిర్మాణాన్ని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) సంస్థ చేపట్టింది. మొదటి నాలుగు ప్లాంటు సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించారు. ఈ మూడు ప్లాంట్లను ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్‌ఎం)గా పేర్కొనేవారు. పాత టెక్నాలజీ కావడంతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తక్కువ పైగా కాలుష్యం ఎక్కువగా ఉండేది. దీంతో పాత ప్లాంట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తిని క్రమంగా నిలిపేస్తూ వచ్చారు. అలా 2019 ఫిబ్రవరి నుంచి 2020 మార్చి నాటికి ఏ, బీ, సీ యూనిట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తిని ఆపేశారు.

తుక్కుకు రూ.485 కోట్లు

కేటీపీఎస్‌లోని ఏ, బీ, సీ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన తర్వాత అప్పటి వరకు వినియోగిస్తూ వచ్చిన టర్బైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కన్వేయర్ బెల్టులు, ఇతర యంత్ర సామగ్రి నిరుపయోగంగా మారాయి. దీంతో వాటిని తుక్కు కింద అమ్మేయాలని జెన్‌కో నిర్ణయం తీసుకుంది. దీంతో మరో కేంద్ర సంస్థ ఎంఎస్‌టీసీ రంగంలోకి దిగింది. ఏ, బీ, సీ ప్లాంట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇక్కడ లభించే ఐరన్, కాపర్, ఇతర యంత్ర విడిభాగాల విలువను మదింపు చేసింది. దీన్ని తుక్కు లెక్కన కొనేందుకు టెండర్లను ఆహ్వానించారు. మొత్తం ఐదు కంపెనీలో పోటీ పడగా కేటీపీఎస్‌లోని పాత మూడు ప్లాంట్లను తుక్కు కింద రూ.485 కోట్లకు కొనుగోలు చేసేందుకు ముంబైకి చెందిన హెచ్ఆర్ కమర్షియల్స్ సంస్థ ముందుకొచ్చింది.

ముందుగా 'ఏ' ప్లాంటు

తొలి దశలో ఏ ప్లాంటును పూర్తిగా తొలగించనున్నారు. ఇందుకుగాను హెచ్ఆర్ కమర్షియల్స్ సంస్థ రూ.144 కోట్లు చెల్లించి రంగంలోకి దిగింది. గత నెలలో పనులు ప్రారంభం కాగా, ప్రస్తుతం ప్లాంటులోకి బొగ్గు తీసుకొచ్చే కన్వేయర్ బెల్ట్ తొలగింపు ప్రక్రియ దాదాపుగా పూర్తి కావొచ్చింది. ఎక్కడికక్కడ భారీ కటింగ్ యంత్రాలతో కన్వేయర్ బెల్ట్ లైన్‌ను ముక్కలుగా చేస్తున్నారు. దీనికి తగ్గట్టుగా పని జరిగే ప్రదేశంలో విద్యుత్ సరఫరా నిలిపేశారు. భారీ నిర్మాణాలను కటింగ్ చేసిన తర్వాత ఇనుము, ఇతర లోహాలను వేరు చేస్తున్నారు. ఇక్కడి నుంచి లారీల ద్వారా తుక్కును తరలిస్తున్నారు. జూన్ వరకు ఏ ప్లాంటు తొలగింపు పనులు సాగనున్నాయి. ఆ తర్వాత వరుసగా బీ, సీ ప్లాంట్లను తొలగిస్తారు. అనంతరం కూలింగ్ టవర్లు, చిమ్నీలను తొలగించాల్సి ఉంటుంది. మొత్తంగా మూడేళ్లలో ఏ, బీ, సీ ప్లాంట్లను పూర్తిగా తొలగించడంతో పాటు నేల మొత్తాన్ని చదును చేసి జెన్‌కోకు అప్పగించాలనే ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో జెన్‌కోకు సుమారు 400 ఎకరాల స్థలం లభించనుంది.

ఇవి కీలకం..

కేటీపీఎస్ పాత ప్లాంట్లను తొలగించే పనిలో అత్యంత కీలకమైనది వందల మీటర్ల ఎత్తుతో నిర్మించిన చిమ్నీలు, కూలింగ్ టవర్ల తొలగింపు. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ నాలుగు కూలింగ్ టవర్లు, ఒక చిమ్నీని తొలగించాల్సి ఉంటుంది. అయితే జెన్‌కో విధించిన షరతుల ప్రకారం ఈ నిర్మాణాలను నేలమట్టం చేసేందుకు పేలుడు పదార్థాలను వినియోగించడం నిషిద్ధం. దీంతో బ్లాస్టింగ్ లేకుండా భారీ నిర్మాణాలను నేలమట్టం చేసేందుకు అనువుగా ఉన్న మార్గాలపై ఇటు జెన్‌కో, అటు హెచ్ఆర్ కమర్షియల్స్ సంస్థలు అన్వేషిస్తున్నాయి. ప్రస్తుతానికి మన దేశంలో గతంలో చంద్రాపూర్‌లో



ఉన్న పాత విద్యుత్ కేంద్రాన్ని తుక్కు కింద అమ్మేశారు. అక్కడ ఏ విధానం పాటించారనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించనున్నారు.

బయోమెట్రిక్ అమలు చేస్తాం

ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమీకృత జిల్లా అధికారుల కార్యాలయం(ఐడీఓసీ)లో బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తామని కలెక్టర్ అనుదీప్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హామీ మేరకు పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీల్లో చేపట్టనున్న పనులపై ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. పాల్వంచలోని చింతలచెర్వును టూరిస్టు ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజావాణి ఫిర్యాదుల్లో కొన్ని..

- అశ్వాపురం మండలం మొండికుంటలో పాత గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ అఖిలపక్ష పార్టీల నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- తమ ఇనామ్ భూమి తిరిగి ఇప్పించాలని జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన దళితులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

ఎండ తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి..

ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు తగు రక్షణ చర్యలు పాటించాలని కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రుల్లో అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మార్చి 1 నాటికి ప్రధాన కూడళ్లలో మంచినీటి కియోస్కులు ఏర్పాటు చేయాలని అన్నారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించాలని, పైపులు లీకేజీ లేకుండా చూడాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి కొరత రాకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ రమాకాంత్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించే ఇంటర్మీడియెట్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సర విద్యార్థులు 10,363 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 9,504 మంది పరీక్షలకు హాజరవుతారని వివరించారు. సమావేశంలో నోడల్ అధికారి సులోచనారాణి, ఏఆర్ డీఎస్పీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

44 వేల ఎకరాలకు పోడుపట్టాలు..

పోడు పట్టాల ప్రక్రియలో మొదటి విడతలో పంపిణీ చేయనున్న 44 వేల ఎకరాల లబ్ధిదారుల పాస్‌పోర్టు ఫొటోలతో పాటు విస్తీర్ణంలో సవరణ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ తహసీల్దార్లను, ఎంపీడీఓలను ఆదేశించారు. పోడుపట్టాల జారీపై సోమవారం ఆయన ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, ఆర్డీఓ స్వర్ణలత పాల్గొన్నారు.

ఏఐసీసీ సభ్యుడిగా 'పొదెం'

అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయికి..



పొదెం వీరయ్య

భద్రాచలం: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సభ్యుల జాబితాలో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు చోటు లభించింది. ఈ మేరకు పార్టీ అధిష్టానం 33 మంది సభ్యుల పేర్లతో సోమవారం జాబితా విడుదల చేయగా అందులో పొదెం వీరయ్య పేరు కూడా ఉండడం విశేషం. ఇప్పటికే ఆయన టీపీసీసీ ఉపాధ్యక్షులుగా, డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

జాతీయ స్థాయికి ఎదిగిన వీరయ్య..

ములుగు జిల్లా మంగపేట మండలం తొండ్యాల్ లక్ష్మీపూర్ గ్రామంలో జన్మించిన పొదెం వీరయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. మొదట ఎంపీటీసీగా గెలుపొంది ప్రజాప్రతినిధిగా సేవలు అందించారు. 1999, 2004లో ములుగు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009, 2014 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2018 ఎన్నికల్లో అనూహ్య పరిణామాల నడుమ భద్రాచలం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. నాటి నుంచి అధికార పార్టీ నుంచి ఫిరాయింపుల ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ నిజాయితీ, నిబద్ధత చాటుకున్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలు, రాష్ట్ర విభజనలో ఏకాకిగా మిగిలిన భద్రాచలం, విలీన పంచాయతీలు, భద్రాచలం అభివృద్ధికి సీఎం ప్రకటించిన రూ.100 కోట్ల నిధుల విడుదల తదితర సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపిస్తున్నారు. జిల్లాలో పార్టీ కార్యకర్తలను ఏకతాటిపై నడిపించడంలో విమర్శలు, ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ సౌమ్యుడిగా, వివాదరహితుడిగా ఉండడంతో పలు పదవులు ఆయనను స్వచ్ఛందంగా వరించాయి. జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి అనతికాలంలోనే జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలను కేంద్ర నాయకత్వం అప్పగించడం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీలో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఏఐసీసీ సభ్యుడిగా ఎన్నికైన పొదెం వీరయ్యకు టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, భద్రాచలం పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని స్థానాలూ మావే

- బీఆర్ఎస్‌కు జిల్లా అడ్డాగా నిలుస్తుంది
- పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలం: వచ్చే అసెంబ్లీ ఎన్నికలల్లో జిల్లాలోని అన్ని స్థానాలనూ బీఆర్ఎస్ గెలుచుకుంటుందని, పార్టీకి జిల్లా అడ్డాగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. సోమవారం ఆయన భద్రాచలంలో విలేకరులతో మాట్లాడారు. కొందరికి బయటకు వెళ్లే ధైర్యం లేక.. బీఆర్ఎస్‌లోనే ఉంటూ పార్టీని విమర్శిస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తలకు డబ్బు ఆశ చూపి వలలో వేసుకోవాలని చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలెవరూ ఆందోళన చెందవద్దన్నారు. కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. ప్రజా పక్షపాతిగా సీఎం కేసీఆర్ అనేక జనాకర్షక పథకాలు అమలు చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, నాయకులు మానె రామకృష్ణ, యశోద నగేష్, బుచ్చయ్య, అన్నే సత్యాలు, తిప్పన సిద్దులు, తాళ్ల రవికుమార్ , ప్రభోద్‌కుమార్, మామిడి పుల్లారావు, చింతాటి చిట్టిబాబు, బషీర్, మల్లెల లోకేష్, నర్రా రాము, ఈర్ల భారతి, సీతామహాలక్ష్మి, పద్మ ప్రియ ఉన్నారు.

క్యాథ్‌ల్యాబ్ సేవలు పునరుద్ధరణ

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సేవలను పునరుద్ధరించారు. ఈనెల 8న షార్ట్ సర్క్యూట్‌తో యూపీఎస్ గదిలోని బ్యాటరీలు కాలిపోవడంతో సేవలు నిలిచిపోగా, సాంకేతిక నిపుణులు పది రోజుల పాటు శ్రమించి కొత్త బ్యాటరీలను అమర్చారు. దీంతో సోమవారం గుండె సంబంధిత పరీక్షలు, చికిత్స అందుబాటులోకి వచ్చాయని అధికారులు వెల్లడించారు.

బీజేపీపై పోరుకు సిద్ధం కండి

- ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం అమ్ముకుంటోంది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన సాబీర్‌పాషా తదితరులు

మణుగూరుటౌన్: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సోమవారం మణుగూరులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసరాల ధరలు విపరీ తంగా పెరిగాయని, దీంతో పేద, మధ్య తరగతి వర్గాల బతుకులు దుర్భరంగా మారాయని అన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ కార్పొరేట్ రంగాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవే టు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని అన్నారు. ఈ తరుణంలో నిత్యం పేదలు, కార్మికుల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎవరితో పొత్తు లేకున్నా ఎన్నికల బరిలో నిలుస్తామని, ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ.. అర్హులందరికీ దళితబంధు అందించాలని, గిరిజనులకు గిరిజన బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరరావు, బి.అయోధ్య, మహిళా సమాఖ్య నాయకురాలు పాకాలపాటి లలితమ్మ, చందు, కమటం వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మికుమారి, ఎల్లయ్య, లక్ష్మీనారాయణ, సరెడ్డి పుల్లారెడ్డి, జంగం మోహన్‌రావు, దుర్గాల సుధాకర్, సొందె కుటుంబరావు, ఆయా మండలాల కార్యదర్శులు అనంతనేని సురేష్, పద్మనాభరాజు, కొంగర సతీష్, లడ్డా, కృష్ణ, వాగబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా నిర్మాణాలు

- అనుమతి లేకుండానే ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు
- వివరాలు సేకరించిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 57,211 గృహాలు ఉన్నట్లు గుర్తింపు



ఇళ్ల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

చుంచుపల్లి: జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 481 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అనుమతి లేని ఇళ్ల వివరాలు సేకరించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించడంతో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, బిల్ కలెక్టర్లు గత మూడు రోజులుగా కసరత్తు చేసి, సోమవారం నాటికి పూర్తి చేశారు. ప్రభుత్వ భూముల్లో ఎవరు ఎంత ఆక్రమించారు.. ఇప్పటివరకు రికార్డుల్లోకి ఎక్కని ఇళ్లు ఎన్ని.. ఒకవేళ ప్రభుత్వ భూములను పేదలకు పంచితే అవి ఎన్ని.. అనే వివరాలు నమోదు చేశారు. సర్కారు స్థలాల్లో అక్రమంగా వేసిన గుడిసెలను సైతం లెక్కించారు. ఇంటి పన్నుల చెల్లింపు ప్రక్రియ ఆధారంగా ప్రతి ఇల్లు, భూముల వివరాలను పరిగణనలోకి తీసుకుని సర్వే చేపట్టారు. కాగా, ప్రభుత్వ అధికారులు ఇళ్ల వివరాలు సేకరిస్తుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రభుత్వం ఈ నివేదికల ఆధారంగా తమపై ఎలాంటి చర్యలు చేపడుతుందోనని భయపడుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టనున్న ఇంటి పథకంలో భాగంగానే ఈ వివరాలు సేకరిస్తోందనే వాదన కూడా వినిపిస్తోంది.

12 రకాల భూములపై సర్వే..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 481 గ్రామ పంచాయతీల పరిధిలో 2.94 లక్షల గృహాలు ఉన్నాయి. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల నిర్మాణాల వివరాలను మూడు రోజుల పాటు సేకరించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఉన్న ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ, సీలింగ్, గ్రామ కంఠం, దేవాదాయ, వక్ఫ్, శిఖం భూములు, ఇతర ప్రభుత్వ శాఖల పరిధిలోని భూములు, ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకున్న భూముల్లో నోటరైజ్‌డ్ పట్టా భూములు, సాదా బైనామాల ద్వారా కొన్న పట్టా భూములు.. ఇలా 12 రకాల సర్కారు భూముల్లో ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇళ్లు నిర్మించారా అనే వివరాలను అధికారులు సేకరించారు. ఈ నివేదికను మొదట కలెక్టర్‌కు, ఆ తర్వాత ప్రభుత్వానికి పంపనున్నారు. అయితే ఈ ఇళ్ల వివరాల సేకరణ సందర్భంగా భారీ సంఖ్యలో అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న గృహాలు ఉన్నట్లు గుర్తించారు. ఉదాహరణకు చుంచుపల్లి మండలంలో 18 గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించగా రికార్డుల్లోకి ఎక్కని ఇళ్లు 5,132 ఉన్నట్లు తేలింది. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న 481 పంచాయతీల పరిధిలో 45,027, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 12,184.. మొత్తం 57,211 ఇళ్లు అనుమతి లేకుండా నిర్మించారని సర్వేలో వెల్లడైంది.

వివరాల సేకరణ పూర్తయింది



కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు 481 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో ప్రభుత్వ భూముల్లో ఉన్న ఇళ్ల వివరాలు సేకరించాం. గత మూడు రోజులుగా ఎంపీడీఓలు, ఎంపీఓలు, కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు ఈ పనిలోనే ఉన్నారు. ప్రభుత్వం సూచించిన అంశాల వారీగా అన్ని రకాల ప్రభుత్వ భూముల్లోని ఇళ్లకు సంబంధించిన వివరాలు సేకరించాం. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించాం.

– అశోక చక్రవర్తి, డీఆర్‌ఓ.

క్లుప్తంగా

కరకట్ట పనుల అడ్డగింత



కరకట్ట నిర్మాణ పనులను అడ్డుకున్న బాధితులు

దుమ్ముగూడెం: సీతమ్మ సాగర్ కరకట్ట నిర్మాణ పనులను సోమవారం నిర్వాసితులు అడ్డుకున్నారు. మండలంలోని సీతానగరం రెవెన్యూ పరిధిలో ఉన్న ఆదివాసీ రైతుల సాగు భూమి కరకట్ట నిర్మాణంలో పోతుండగా, నష్ట పరిహారం చెల్లించకుండా పనులు చేపడుతున్నారు. దీంతో బాధితులతో కలిసి ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సొంది మల్లుదొర, సర్పంచ్ తెల్లం వరలక్ష్మి , ఉప సర్పంచ్ ఖాదర్ బాబు, ఆదివాసీసేన నాయకురాలు వాగే రాజేశ్వరి తదితరులు పనులను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ అధికారులు సాగు భూమి కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూములు తవ్వే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు సైట్ మీదకు వచ్చి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోరం మురళి, వెంకటేష్, అల్లేష్, నాగమణి, పొడియం వెంకటరమణ, నిర్వాసిత ఆదివాసీ రైతులు పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

గుండాల: తాటి చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. చింతలపాడు గ్రామానికి చెందిన రైతు కల్తి కాంతారావు తన ఇంటి సమీపంలోని తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుంటాడు. సోమవారం కూడా చెట్టు ఎక్కగా, ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని గుండాల ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

కలప స్వాధీనం



పట్టుకున్న కలప ట్రాక్టర్‌తో అటవీశాఖ సిబ్బంది

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం అటవీరేంజ్ పరిధి దేవరపల్లి బీట్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీశాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. దేవరపల్లి బీట్ అటవీప్రాంతం నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో రూ.90 వేల విలువైన 4 టేకు దిమ్మెలు తరలిస్తుండగా రాళ్లగూడెం సమీపంలో పట్టుకున్నట్లు దుమ్ముగూడెం రేంజ్ అధికారి కనకమ్మ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరు జవాన్లను హతమార్చిన మావోయిస్టులు


ఛత్తీస్‌గఢ్‌లో ఘటన



ఘటనా స్థలంలో జవాన్ల మృతదేహాలు, పక్కన దగ్ధమైన ద్విచక్రవాహనం

చర్ల: కూంబింగ్ ఆపరేషన్ కోసం అటవీ ప్రాంతానికి ద్విచక్ర వాహనాలపై వస్తున్న పోలీసులపైకి మావోయిస్టులు కాల్పులు జరపగా ఇద్దరు జవాన్లు మృతిచెందిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం చోటుచేసుకుంది. రాజ్‌నంద్‌గావ్ జిల్లా బొర్తలావ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాధారణ తనిఖీల్లో భాగంగా జవాన్లు ద్విచక్రవాహనాలపై బయలుదేరారు. నాకా గ్రామ సమీపంలోకి రాగానే.. ప్రధాన రహదారి పక్కన ఓ పాత భవనం వెనుక మాటువేసి ఉన్న మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒకే బైక్‌పై వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ రాజేష్‌సింగ్, కానిస్టేబుల్ లలిత్‌యాదవ్ అక్కడికక్కడే మృతిచెందగా, అనంతరం అక్కడికి చేరుకున్న మావోయిస్టులు ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేశారు. మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ మెంబర్ దేవ్‌చంద్ అలియాస్ చందు, లోకల్ ఆర్గనైజేషింగ్ స్క్వాడ్(ఎల్‌ఓఎస్) కమాండర్ రానో నేతృత్వంలో జరిగిన ఈ ఘటనలో 15 మంది మావోయిస్టులు పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇల్లు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ఇల్లు

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతుల కొత్తూరు గ్రామానికి చెందిన కుర్సం కృష్ణమూర్తికి చెందిన ఇల్లు సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని దగ్ధమయింది. మంటలు ఒక్కసారిగా ఎగసిపడటంతో ఇంట్లోని సామగ్రి, పత్తి, ధాన్యం, నగదు, పుస్తకాలు కాలిపోయాయి. స్థానికులు సమాచారమివ్వగా ఫైరింజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు ఇతర ఇళ్లకు అంటుకోకుండా అదుపు చేశారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

వైరాలో రాజకీయ వేడి

కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లు

- 14 మంది బీఆర్‌ఎస్, ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు
- పొంగులేటి వర్గానికి బీఆర్‌ఎస్ షాక్
- చైర్మన్ ఎన్నికై గత నెల 27తో మూడేళ్లు పూర్తి



కలెక్టర్ గౌతమ్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇస్తున్న వైరా కౌన్సిలర్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం / వైరా: వైరా మున్సిపల్ కేంద్రంగా జిల్లా రాజకీయాలు వేడెక్కాయి. కొద్దిరోజులుగా బీఆర్‌ఎస్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి వర్గం మధ్య కొనసాగుతున్న రచ్చ అవిశ్వాస తీర్మానం వరకు వెళ్లింది. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌కు వ్యతిరేకంగా 16 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసును కలెక్టర్‌కు సోమవారం అందజేశారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సారథ్యాన ఎంపీలు, ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సమావేశమైన మరుసటి రోజే పొంగులేటి వర్గంపై ఎదురుదాడి మొదలైనట్లయింది. ఈ ఎపిసోడ్‌లో ఎమ్మెల్యే రాములునాయక్‌కు ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అండగా నిలిచి చక్రం తిప్పినట్లు చర్చ జరుగుతోంది. వైరాలో కౌన్సిలర్లతో మంతనాలు, ఆ వెంటనే ఖమ్మం చేరుకుని కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం అందజేయడం చకచకా జరిగిపోయాయి. ఈ వ్యవహారం పొంగులేటి వర్గానికి షాక్ ఇవ్వగా.. ఇంకా ఎవరైనా కౌన్సిలర్లు పార్టీ నుంచి జారిపోతారేమోననే ప్రచారానికి బీఆర్‌ఎస్ చెక్ పెట్టినట్లయింది. అవిశ్వాస తీర్మానంపై బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా సంతకం పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగింది..

వైరా మున్సిపాలిటీ ఎన్నికలు 2020 జనవరి 20న జరగగా, 27న కౌన్సిల్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 15, కాంగ్రెస్ ఇండిపెండెంట్లు రెండేసి వార్డులు, సీపీఎం ఒక స్థానం గెలుచుకున్నాయి. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా ఇండిపెండెంట్లు ఇద్దరు, సీపీఎం కౌన్సిలర్ ఒకరు బీఆర్‌ఎస్‌లో చేరగా బలం 18కి చేరడంతో మున్సిపల్ చైర్మన్‌గా సూతకాని జైపాల్, వైస్ చైర్మన్‌గా ముళ్లపాటి సీతారాములు ఎన్నికయ్యారు. చైర్మన్ జైపాల్ తొలి నుంచి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా కొనసాగుతూనే బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. ఈ ఏడాది జనవరి 1న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్‌ఎస్‌పై అసంతృప్తి వ్యక్తం చేయడం, ఆ తర్వాత వైరాలో తన అభ్యర్థిగా బానోతు విజయాబాయిని ప్రకటించడంతో మున్సిపల్ చైర్మన్‌తోపాటు మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మరికొందరిపై పార్టీ వేటు వేసింది. అనంతరం వైరా మున్సిపాలిటీ కౌన్సిలర్లు పణితి ఉష, కన్నెగంటి సునీత, గుగులోతు లక్ష్మీబాయి సైతం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి పొంగులేటి వర్గంలో చేరారు.

వ్యూహంతో ముందుకెళ్లి..

చైర్మన్‌తోపాటు ముగ్గురు కౌన్సిలర్లు పొంగులేటి వర్గంలో చేరడంతో మిగతా ఎవరు కూడా పార్టీని వీడకుండా పక్కా వ్యూహంతో బీఆర్‌ఎస్ పెద్దలు వ్యవహరించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన 14 మంది, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లతో వేర్వేరుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే రాములునాయక్ వైరాలో చర్చించారు. ఉదయం వారితో మాట్లాడిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సాయంత్రంలోగా కౌన్సిలర్లతో అవిశ్వాస తీర్మాన నోటీసు కలెక్టర్‌కు ఇప్పించడం గమనార్హం. ఎమ్మెల్యే ముందుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకోగా.. ఆ తర్వాత కౌన్సిలర్లు వచ్చి ఏకగ్రీవ అవిశ్వాస తీర్మాన నోటీసును కలెక్టర్‌కు అందజేశారు.

సమస్యలను పట్టించుకోకపోవడంతో..

తమ వార్డుల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో పాటు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నందునే చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేసినట్లు కౌన్సిలర్లు తెలిపారు. వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మీడియాతో చెప్పారు. సర్వ సభ్యసమావేశాల అజెండా కాపీలను కూడా ముందు పంపకుండా అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు.

ఎలా ముందుకెళ్తారు?

వైరా మున్సిపల్ చైర్మన్‌పై కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చిన నేపథ్యాన ఈ వ్యవహారంలో ఎలా ముందుకెళ్తారన్నది ఇటు బీఆర్‌ఎస్ నేతలతో పాటు అటు పొంగులేటి వర్గం ఎదురు చూస్తోంది. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం నాలుగేళ్ల తర్వాతే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశమున్నా ఈ చట్టానికి ఆమోదముద్ర పడాల్సి ఉంది. దీంతో పాత మున్సిపల్ చట్టం ప్రకారం మూడేళ్లకే అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశముండడంతో కౌన్సిలర్లు ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు.

గత నెల 27తో మూడేళ్లు పూర్తి..

మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరిగి గత నెల 27తో మూడేళ్లు పూర్తయింది. అవిశ్వాస తీర్మానం నోటీసులో పేర్కొన్న ప్రకారం బలాబలాలు చూస్తే బీఆర్‌ఎస్ 14 మంది, కాంగ్రెస్ ఇద్దరితో కలిపి బీఆర్‌ఎస్‌కు మొత్తం 16 మంది కౌన్సిలర్ల బలం ఉండగా.. పొంగులేటి వర్గంలో చైర్మన్‌తోపాటు మరో ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారు. పాత మున్సిపల్ చట్టం ప్రకారం అవిశ్వాసం తీర్మానానికి అనుమతిస్తే మొత్తం సభ్యుల్లో 11 మంది కౌన్సిలర్లు ఎవరికి మద్దతు ఇస్తే వారు చైర్మన్‌గా ఎన్నిక కానున్నారు.

సవాల్ చేశారు.. చూపిస్తున్నాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్

కలెక్టరేట్ ఆవరణలోఎమ్మెల్యే రాములు నాయక్ మాట్లాడుతూ 'మమ్ముల్ని టచ్ చేసి చూడండి ఏం జరుగుతుందో అంటూ వారు సవాల్ విసిరారు.. అందుకే పార్టీ ఆధ్వర్యాన మేం వారిని టచ్ చేసి చూపిస్తున్నాం. పార్టీ జోలికి ఎవరు వచ్చినా ఊరుకునేది లేదు. ప్రొసీజర్ ప్రకారం కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చారు.' అని తెలిపారు. కౌన్సిల్‌కు చెందిన 16మంది నిక్కచ్చిగా ఉండగా.. నలుగురు అటు వైపు వెళ్లారని పేర్కొన్నారు. అవిశ్వాసం నోటీసు ఇచ్చిన 16 మందిలో ఇద్దరు కాంగ్రెస్ సోదరులు ఉన్నారని తెలిపారు. కాగా, నోటీసు ఇవ్వగా కలెక్టర్ మున్సిపల్ చట్టం ప్రకారం ముందుకెళ్తామని చెప్పినట్లు వెల్లడించారు. ఇకఉదయం వైరాలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే రాములునాయక్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ జైపాల్ బీఆర్‌ఎస్ బీ ఫాంతో గెలవగా, పార్టీ నుంచి సస్పెండ్ చేసినందున నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలని సూచించారు. వైరా మున్సిపాలిటీకి ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.30 కోట్ల ప్రత్యేక నిధులను కౌన్సిలర్ల ద్వారానే ఖర్చు చేస్తామని తెలిపారు.

ఇల్లెందు డిగ్రీ కళాశాలకు 'బీ ప్లస్'



ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- మెరుగుపడ్డ కాలేజీ న్యాక్ గ్రేడ్
- ఐదేళ్లలో రూ.3 కోట్ల నిధులకు అవకాశం

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గ్రేడ్ మెరుగుపడింది. మూడో దఫాలో ఇల్లెందు డిగ్రీ కళాశాల న్యాక్‌లో ఏడు పాయింట్లకు గాను 2.63 పాయింట్లతో 'బీ ప్లస్' గ్రేడ్ సాధించింది. ఈ మేరకు నేషనల్ అక్రిడిటేషన్ అండ్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (న్యాక్), యూజీసీ, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేశాయి. న్యాక్‌లో గ్రేడ్ పెంపుతో కళాశాలలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

కళాశాల ప్రస్థానం ఇలా..

పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన ఇల్లెందుకు 1992లో డిగ్రీ కళాశాల మంజూరైంది. సొంత భవనం లేకపోవడంతో దాదాపు దశాబ్దం వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక పూట తరగతులతో కొనసాగింది. 2002 నుంచి కళాశాల సొంతభవనంలో కొనసాగుతుండగా, 2007లో తొలిసారిగా న్యాక్ పరిశీలనకు ఎంపికైంది. తొలి అడుగులోనే 2.20 పాయింట్లతో బి గ్రేడ్ సాధించింది. ఆరేళ్ల తర్వాత మెరుగైన బోధనతో 2.31 గ్రేడింగ్ పాయింట్లు పొందింది. ఇటీవల న్యాక్ బృందం పరిశీలన 2.63 గ్రేడింగ్ పాయిట్లతో బీ ప్లస్ గ్రేడ్ సొంతం చేసుకుంది. దీంతో కళాశాలకు ఐదేళ్లపాటు రాష్ట్రీయ ఉచ్చతర శిక్షా అభియాన్ (రూసా) ద్వారా రూ.3 కోట్లు మంజూరయ్యే అవకాశం దక్కించుకుంది.

సమష్టి కృషితో..



విద్యార్థులు, అధ్యాపకుల సమష్టి కృషితో అరుదైన గౌరవం దక్కింది. న్యాక్‌లో 'బి ప్లస్'గ్రేడ్‌తో కళాశాలకు ఇక నిధుల కొరత ఉండదు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చేందుకు కృషి చేస్తాం. – డాక్టర్ పి.పద్మ, కళాశాల ప్రిన్సిపాల్

11 కులాలను చేర్చే తీర్మానం రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ నాయకులు

భద్రాచలం: 11 కులాలను ఎస్టీ జాబితాలో కలిపేందుకు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానం రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన దర్బారులో ఉన్న ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వి చంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓట్ల రాజకీయం కోసం ఆదివాసీలను బలిపశువులను చేస్తోందని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే ప్రత్యేక తెలంగాణలో ఆదివాసీలను దారుణంగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. తీర్మానం ఉపసంహరించుకోకపోతే ఏజెన్సీలో ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతుందని, ఆదివాసీ ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కొడెం వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, ఏఎస్‌పీ జిల్లా నాయకులు ఉమ్మళ దుర్గారెడ్డి, పూనెం రమణ బాబు, ఊకే నాగేశ్వరరావు, శంకర్, సున్నం ప్రసాద్, సున్నం ప్రశాంత్, గొగ్గలి రాజేష్, కొండ్రు నరసింహ రావు, మల్లేష్, పాయం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నా భూమి ఇప్పించండి..

కలెక్టర్‌కు మాజీ నక్సలైట్ సమ్మయ్య వినతి



కలెక్టర్ అనుదీప్‌కు సమస్య వివరిస్తున్న బాధితుడు

ఇల్లెందురూరల్: తనకు కేటాయించిన భూమి ఇప్పించాలని, లేకపోతే చనిపోయేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఇల్లెందుకు చెందిన మాజీ నక్సలైట్ కొడెం సమ్మయ్య కలెక్టర్‌ను కోరాడు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో తన సమస్య వివరించాడు. మాజీ నక్సలైట్ అయిన తనకు ప్రభుత్వం పునరావాస పథకం కింద ఇచ్చిన భూమిని మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ అక్రమించుకున్నారని, ఇదే విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయాల చుట్టూ తిరిగే ఓపిక తనకు లేదని, ప్రభుత్వం కేటాయించిన భూమిని తనకు అప్పగించాలని, లేనిపక్షంలో చనిపోయేందుకైనా అనుమతివ్వాలని వేడుకున్నాడు.

ఆడుకునేందుకు వెళ్లి అనంతలోకాలకు..

- గోదావరిలో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం
- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు




అక్బర్ బాషా, పాలపర్తి వాసు మృతదేహాలు

భద్రాచలంఅర్బన్: క్రికెట్ ఆడేందుకు వెళ్లిన ఇద్దరు యువకులు ఆదివారం గోదావరిలో గల్లంతుకాగా, సోమవారం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. పట్టణంలోని జగదీష్ కాలనీ, ఏఎంసీ కాలనీ, అశోక్ నగర్ కొత్త కాలనీలకు చెందిన పొట్నూరి అఖిల్, షాహి అజీమ్, సిద్ధిబోయిన జశ్వంత్, ముద్దా కుమార్, అక్బర్ బాషా(17), పాలపర్తి వాసు(16) ఆరుగురు స్నేహితులు. క్రికెట్ ఆడేందుకు వీరంతా ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లారు. క్రికెట్ ఆడిన అనంతరం సాయంత్రం సమయంలో నేరుగా పట్టణానికి ఆనుకుని ఉన్న ఎటపాక(ఏపీ సరిహద్దు) ప్రాంతంలోని మేడువాయి వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లారు. పాలపర్తి వాసు, బాషా నదిలో దిగి ఈత కొడుతున్న క్రమంలో లోతు గమనించక గల్లంతయ్యారు. ఒడ్డునున్న నలుగురు.. స్నేహితులను కాపాడలేక చూస్తూ ఉండిపోయారు. కళ్లముందే ఇద్దరు మిత్రులు గల్లంతవడంతో భయాందోళనతో ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు గోదావరి వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. అప్పటికే రాత్రి కావడంతో అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది నదిలో గాలింపు చేపట్టేందుకు వీలుకాలేదు. సోమవారం ఉదయమే గాలింపు చేపట్టగా వాసు, అక్బర్ బాషా మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏపీలోని ఎటపాక పోలీసులు కేసు నమోదుచేశారు. క్రికెట్ ఆడుకునేందుకు వెళ్లిన యువకులు విగత జీవులై రావడంతో తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. గోదావరి వద్ద, ఏరియా ఆస్పత్రి వద్ద రోదనలు మిన్నంటాయి.

రక్షణ చర్యలు చేపట్టాలి

గోదావరి పరీవాహక ప్రాంతంలో మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. గోదావరిలో ఈత కొడుతూ, స్నానం చేసేందుకు దిగి పలువురు భక్తులు, స్థానికులు గల్లంతైన సంఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

మాకు అనుమానాలు ఉన్నాయి..



ఏరియా ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

తమ పిల్లల మృతిపై అనుమానం ఉందంటూ పాలపర్తి వాసు తల్లి నాగలక్ష్మి, అక్బర్ బాషా తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలను మిగిలిన నలుగురు యువకుల్లో ఎవరో కావాలని గొడవ పడి, కొట్టి గోదావరిలోకి తోసేశారనే అనుమానం వ్యక్తం చేశారు. కాగా వాసు చర్ల రోడ్డులోని ఓ షోరూంలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. తల్లిదండ్రులకు ఒక్కడే సంతానం కావడంతో వేదనాభరితులయ్యారు. అక్బర్ బాషా రోజువారీ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బాషాకు ఇద్దరు చెల్లెళ్లు. కుటుంబాన్ని పోషించే కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డు పడ్డట్టయింది. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఈ నెల 18న సాయంత్రం వెంకటాపురం మండలం విజయపురి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ప్రభుదాస్ రోడ్డు దాటుతుండగా స్కూటీపై వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో ప్రభుదాస్ తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా బాధితుడి సోదరుడు ప్రసాద్ రావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని, స్కూటీ నంబర్ ఆధారంగా సదరు వ్యక్తి వివరాలు ఆరా తీసి, అతనిపై కూడా కేసు నమోదు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ సూర్యం తెలిపారు.

ఖమ్మం రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: మహారాష్ట్రలోని పూణేకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఖమ్మం రైల్వేస్టేషన్‌లో సోమవారం జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని పూణేకు చెందిన ప్రశాంత్‌కిషన్ బండారి, రుతిక్ మహేష్, ఆకాష్‌రాజ్ సంకట్ ఈ నెల 18వ తేదీన విశాఖపట్నం నుంచి పూణే వెళ్లేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. అయితే, రైలులో రద్దీ ఉండడంతో 19వ తేదీన ఖమ్మంలో స్టేషన్‌లో దిగి సోమవారం మరో రైలులో బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో తనిఖీ చేయగా ముగ్గురి వద్ద రూ.2లక్షల విలువైన 18కేజీల ఎండు గంజాయి లభ్యమైందని జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

లోన్ డబ్బులు ఇవ్వలేదని నిరసన

పాల్వంచ: గతంలో పరిచయం అయిన వ్యక్తి తన పేరుతో తీసుకున్న లోన్ డబ్బులు ఇవ్వడం లేదని ఒడిశాకు చెందిన ఓ మహిళ సోమవారం నిరసన తెలిపింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాత పాల్వంచకు చెందిన ఓ వ్యక్తితో మహిళకు పరిచయం ఉంది. ఈ క్రమంలో ఆమె పేరుతో రూ.25 లక్షల వరకు లోన్ తీసుకున్నాడు. కాగా మూడేళ్లు గడుస్తున్నా లోన్ చెల్లించడం లేదు. ఈ విషయమై సదరు మహిళ కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి రావడంతో పాటు, లోన్ బకాయి కట్టాలని బ్యాంక్ నుంచి నోటీసులు వస్తున్నాయి. దీంతో ఆమె సదరు వ్యక్తి వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని కోరుతున్నా... ఎప్పటికప్పుడు వాయిదాలు వేస్తూ తప్పించుకుంటున్నాడని ఆరోపిస్తూ మహిళ తన కుమారుడిని ఎత్తుకుని వచ్చి శ్రీనివాస కాలనీ సమీపంలోని శివాలయం వద్ద బైఠాయించింది. డబ్బులు ఇవ్వని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు వారిని పోలీస్ స్టేషన్ తీసుకొచ్చి విచారిస్తున్నారు.

బాలుడి అదృశ్యం

దమ్మపేట: బాలుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన పిట్ల రమణ ఈ నెల 17న తన 12ఏళ్ల కుమారుడు పిట్ల నరేష్‌ను ప్రవర్తన సరిగాలేదని మందలించా డు. దీంతో ఇంట్లో నుంచి వెళ్లిన బాలుడి తిరిగి రాలేదు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి, కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... నాచారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందగా పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5,170 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రూ.31.60 లక్షలకు పత్తి వ్యాపారి ఐపీ

ఖమ్మంలీగల్: ఖమ్మం ఎల్.బీ.నగర్‌కు చెందిన పత్తి వ్యాపారి సోమవారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. పదేళ్లుగా పత్తి, సుబాబుల్ వ్యాపారం చేస్తున్న షేక్ నాగుల్‌మీరా తనకు నష్టాలు రావడంతో అప్పులు తీర్చలేకపోతున్నానని చెబుతూ రూ.31.60లక్షల ఐపీ దాఖలు చేశాడు. ఈమేరకు 22మంది ప్రతివాదులుగా చేర్చాడు.

మూడు నెలల క్రితం అదృశ్యం..

చెరుకు తోటలో అస్థిపంజరంగా లభ్యం



సత్యనారాయణ (ఫైల్)

నేలకొండపల్లి: మతిస్థిమితం లేక గ్రామంలో తిరుగుతూ ఉండే వ్యక్తి మూడు నెలల క్రితం అదృశ్యం కాగా.. చెరుకు తోటలో అస్థిపంజరంగా కనిపించాడు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం మోటాపురానికి చెందిన చావా సత్యనారాయణ(58) మతిస్థిమితం కోల్పోగా గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ తిరిగేవాడు. తెలిసిన వారికి కనిపిస్తే తీసుకొచ్చి ఇంట్లో అప్పగించేవారు. అలాగే, మూడు నెలల క్రితం కూడా ఇంటి నుంచి వెళ్లిపోయిన సత్యనారాయణ కనిపించలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు పలు ప్రాంతాల్లో గాలించడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పోస్ట్ చేసినా ఆచూకీ లభించలేదు. చివరకు మూడు నెలల తర్వాత సోమవారం గ్రామంలోని చెరుకు తోటలో దుర్వాసన వస్తుండడంతో కూలీలు గమనించగా అస్థిపంజరం కనిపించింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపగా అనుమానంతో సత్యనారాయణ కుటుంబ సభ్యులు పరిశీలించి దుస్తుల ఆధారంగా నిర్ధారించారు. ఎప్పటికైనా సత్యనారాయణ వస్తాడని భావిస్తుండగా ఆనవాళ్లు లేకుండా అస్థిపంజరం లభించడంతో ఆయన భార్య, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి ఆధ్వర్యాన సిబ్బంది చేరుకుని అస్థిపంజరాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, మృతుడి కుటుంబాన్ని బీజేపీ నాయకులు నున్నా రవికుమార్, చావా కిరణ్‌కుమార్, గుడిమల్ల మధు, లెనిన్ పరామర్శించారు.

ఆరె కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చెట్టిపల్లి శివాజీ



ఆరె కుల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు చెట్టిపల్లి శివాజీ తదితరులు

అంబర్‌పేట (హైదరాబాద్): ఆరె కుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. సోమవారం అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీ ఆవిర్భవించింది. అధ్యక్షుడిగా చెట్టిపల్లి శివాజీ, గౌరవ అధ్యక్షుడిగా నాగుర్ల వెంకన్న, స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా దిగంబర్‌రావు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా రాంబాబు, ఉద్యమ కమిటీ చైర్మన్‌గా అంజన్‌రావు, ఆరె కుల రైతు సంఘ అధ్యక్షుడిగా మోర్తాల చందర్‌రావుతో పాటు వివిధ కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. ఉప్పల్ బగాయత్‌లో ఆరె కుల సంఘానికి ఒక ఎకరం స్థలం, రూ.కోటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. అలాగే భవన నిర్మాణానికి మరో రూ.4 కోట్ల నిధుల కోసం విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఆరె కుల సంఘాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. సమావేశంలో కుల సంఘం నాయకులు రామ నర్సింహయ్య, కోల కృష్ణస్వామి, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గొప్పగా.. గర్వంగా!

- మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయం అమలు చేస్తున్నాం: ఏపీ సీఎం జగన్
- ఎమ్మెల్సీలుగా 18 మంది పేర్లు ఖరారు.. 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీలే
- మిగిలిన 4 సీట్లలో ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కొక్కటి



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నామని, ఇంత గొప్పగా ఎప్పుడూ జరగలేదని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మనం చేసిన సామాజిక న్యాయాన్ని ప్రతి నియోజకవర్గంలో వినిపించాలని, ప్రతి గడపకూ చేరవేయాలని ఎమ్మెల్సీ అభ్యర్థులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల కోటా, ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించిన వారితో ముఖ్యమంత్రి జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

సుదీర్ఘ కసరత్తు అనంతరం..

గతంలో ఎప్పుడూ చూడనంత, జరగనంత సామాజిక న్యాయాన్ని దేవుడి దయతో మన పార్టీలో చేయగలుగుతున్నామని గర్వంగా చెప్పుకునే గొప్ప పరిస్థితుల్లోకి వచ్చాం. ఇవాళ చాలా సుదీర్ఘ కసరత్తు అనంతరం 18 మందిని ఖరారు చేస్తే వారిలో 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారే. ఇంత గొప్పగా సామాజిక న్యాయం ఎప్పుడూ జరగలేదు. మిగిలిన సామాజిక వర్గాలకు నాలుగు సీట్లిస్తే అందులో కూడా ఒక్కో సామాజిక వర్గానికి ఒకటి చొప్పున కేటాయించాం. మనం చేస్తున్న సామాజిక న్యాయం ప్రతి గడపకూ తెలియాలి, ప్రతి నియోజకవర్గంలోనూ చెప్పాలి.

ధీటుగా, మరింత దూకుడుగా..

పదవులు పొందిన వారు పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉండాలి. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 లాంటివి ఒక్కటై లేనిపోని విషప్రచారం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మనం కూడా అంతే ధీటుగా, యాక్టివ్‌గా, మరింత దూకుడుగా పనిచేయడం ద్వారా మన వాణిని సమర్థంగా వినిపించాలి.

వారిని కన్విన్స్ చేసుకుంటూ వెళ్లాలి

ఈ పదవులను ఆశించిన వారు ఇంకా చాలా మంది ఉన్నారు. ఉన్న పదవులు తక్కువ, ఆశావహులు ఎక్కువగా ఉంటారు కాబట్టి అందర్నీ సంతృప్తి పరచలేం. కొద్దో గొప్పో కొరత ఉంటుంది. వీరందరికీ కూడా చెప్పే రీతిలో నచ్చచెబుతూ, కన్విన్స్ చేసుకుంటూ వెళ్లాలి.

మిగతా వారికి ఈసారి

దేవుడు ఆశీర్వదిస్తే గత ఎన్నికల కంటే ఈసారి అత్యధిక స్థానాలు సాధిస్తాం. ఇంకా చాలా మందికి రాబోయే రోజుల్లో ఎక్కువ అవకాశాలు వస్తాయి. చంద్రబాబు అరకొర పదవులిచ్చి బీసీలకు అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకోవటాన్ని మనం చూశాం. ఈసారి మనం వడ్డీలు, వడ్డెర కులాల వారికి అవకాశం ఇచ్చాం. రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇంకా మిగిలిన కులాలకు తదుపరి దఫాలో తప్పకుండా అవకాశం ఇస్తామని భరోసా ఇస్తున్నాం.

మేమంతా ఒక్కటే

కాంగ్రెస్ పార్టీ నేతలంతా కలిసే ఉన్నాం

- ఓరుగల్లు ఎమ్మెల్యేలు దండుపాళ్యం ముఠా
- డైరీ రాస్తున్నాం... వడ్డీతో చెల్లిస్తాం
- తెలంగాణలో టీఆర్ఎస్, బీజేపీ నేతల భూకబ్జాలు...
- వరంగల్ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో రేవంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, వరంగల్: 'మేమంతా ఒక్కటే.. మా నాయకులంతా కలిసే ఉన్నాం.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ఈ రాష్ట్ర ప్రజలు, మేం సిద్ధంగా ఉన్నాం.. 2024 జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుంది' అని టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమకొండ అమృత జంక్షన్ వద్ద నిర్వహించిన సభలో ప్రసంగించారు. బీఆర్ఎస్ నేతలే కాదు.. బీజేపీ నేతలు కూడా భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా నష్టం జరుగుతున్నా అమరుల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కానీ సరైన పరిపాలన జరగక కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ బొందల గడ్డగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదిక ప్రకారం రాష్ట్రంలో 80 వేలమంది రైతులు, మూడు వేల మంది నిరుద్యోగుల ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ఇప్పటికీ పూర్తికాలేదు కానీ 9 నెలల్లో 10 ఎకరాల్లో 150 గదులతో దొరల గడీలను తలపించే ప్రగతి భవన్ మాత్రం పూర్తయిందని ఎద్దేవా చేశారు.

ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు బిల్లా రంగాల్లా దోచుకుంటున్నారు

వరంగల్ ఎంపీ పసునూరు దయాకర్ పసిపిల్లగాడు అనుకుంటున్నారని, కానీ ఆర్టీసీ టైర్ల ఫ్యాక్టరీని మూసివేసి హంటర్ సెంటర్లో 6 ఎకరాల భూమిని కాజేసిన ఘనత ఆయనదని ఆరోపించారు. ఓరుగల్లు ఎమ్మెల్యేలు దండుపాళ్యం ముఠా అని, వరంగల్ ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు బిల్లా రంగాల్లా ప్రజలను దోచుకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'వరంగల్‌లో ఏ ఎమ్మెల్యేను తీసుకున్నా ఉద్యమం సమయంలో వీరి దగ్గర ఏమీ లేదు. కానీ ఇప్పుడు వేల కోట్లకు పడగలెత్తారు. దండుపాళ్యం ముఠాకు హన్మకొండ సాక్షిగా హెచ్చరిక చేస్తున్నా. గోడ మీద రాసిపెట్టుకోండి. రోజులు లెక్కపెట్టుకోండి. డైరీలో ప్రతి ఒక్కటీ నోట్ చేసుకుంటున్నాం. మా పార్టీ నాయకులు, కార్యకర్తల మీద కేసులు పెట్టి వేధించిన దండుపాళ్యం ముఠాకు ఇంతకింత మిత్తితో సహా చెల్లిస్తాం'' అని హెచ్చరించారు. పాదయాత్రకు ముందు కాజీపేటలోని హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియబాని దర్గాను దర్శించుకొని రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మాజీ మంత్రులు మహ్మద్ అలీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నేతపై దాడి

రేవంత్ యాత్ర ముగింపు తరువాత ఘటన



వరంగల్ క్రైం: హనుమకొండలో సోమవారం రాత్రి కాంగ్రెస్ యువజన నాయకుడు తోట పవన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బహిరంగసభ ముగిసిన కొన్ని నిమిషాలకే సభావేదికకు వంద మీటర్ల దూరంలోనే ఈ దాడి జరిగింది. ముక్కు, కుడి కన్ను భాగంలో బలమైన గాయాలయ్యాయి. వీపుపై వాతలు తేలాయి. రక్తపుమడుగులో ఉన్న పవన్‌ను స్థానికులు గమనించి హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. డీసీసీ నేత నాయిని రాజేందర్‌రెడ్డి ఆస్పత్రి వద్ద మాట్లాడుతూ పవన్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలే దాడి చేశారని ఆరోపించారు.

ప్లకార్డులతో నిరసన..: రేవంత్‌రెడ్డి యాత్ర సమయంలో హనుమకొండలోని బాలసముద్రం అంబేడ్కర్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు పంచాలని తోట పవన్ డిమాండ్ చేస్తూ స్థానికులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. ఆ తరువాత రేవంత్ బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఆ సభ ముగియగానే ఈ దాడి జరిగింది.

సాయన్నకు తుది వీడ్కోలు



సాయన్న అంతిమయాత్ర దృశ్యం

కంటోన్మెంట్ (హైదరాబాద్): బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయుల అశ్రునయనాల మధ్య ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు ముగిశాయి. అశోక్‌నగర్‌లోని సాయన్న నివాసం నుంచి ఆయన భౌతికకాయాన్ని సోమవారం ఉదయం 11.30కి కార్ఖానాలోని క్యాంపు ఆఫీసుకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం వరకు అభిమానుల సందర్శనార్థం అక్కడే ఉంచారు. మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్ తదితరులు నివాళులు అర్పించారు. మధ్యాహ్నం 3.00 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన సాయన్న అంతిమయాత్ర.. సాయంత్రం 5.00 గంటలకు మారేడుపల్లి శ్మశానవాటికకు చేరుకుంది. సాయన్నకు ముగ్గురు కుమార్తెలు నమ్రత, నివేదిత, లాస్య నందిత ఉండగా.. పెద్ద కుమార్తె నమ్రత భర్త చందు ముందు నడిచి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా... సాయన్న భౌతిక కాయాన్ని దహనవాటిక వద్ద దింపి ఆఖరి క్రతువు చేపడుతుండగా.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సాయన్నకు ప్రభుత్వ అధికార లాంఛనాలు చేపట్టడం లేదేమంటూ అభిమానులు ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావులను దీనిపై నిలదీశారు. ఈ క్రమంలో మంత్రి తలసాని ఆందోళనకారుల వద్దకు వచ్చి కాసేపట్లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయని చెప్పి వెళ్లిపోయారు. కాసేపటికే మంత్రి మల్లారెడ్డి కూడా వెళ్లిపోవడంతో ఆందోళన చేస్తున్న అభిమానులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కానీ పోలీసులు తమకు అధికారిక ఉత్తర్వులేవీ లేవని, సూర్యాస్తమయం తర్వాత అధికార లాంఛనాలు నిర్వహించే అవకాశం లేదని తేల్చి చెప్పారు. పద్మారావు తదితరులు సాయన్న భార్య, కుమార్తెలతో మాట్లాడి అంత్యక్రియలు పూర్తి చేయాల్సిందిగా ఒప్పించారు. సాయన్న కుటుంబీకుల విజ్ఞప్తితో ఆందోళనకారులు శాంతించగా.. రాత్రి 7.30 గంటలకు అంత్యక్రియలు ముగిశాయి.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

- మొత్తం 18 మంది అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనమండలిలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న 9 స్థానిక సంస్థల నియోజకవర్గాలతో పాటు.. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ కానున్న 7 స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఖరారు చేశారు. గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న రెండు స్థానాలకు సంబంధించిన అభ్యర్థులను కూడా సీఎం వైఎస్ జగన్ ప్రతిపాదించారు. మొత్తం 18 మంది అభ్యర్థుల వివరాలను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాకు వెల్లడించారు. బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 కేటాయించారు.

సామాజిక వర్గాల వారీగా ఎమ్మెల్సీ అభ్యర్థులు

కోటా	బీసీ	ఎస్సీ	ఎస్టీ	ఓసీ	మొత్తం
స్థానిక సంస్థలు	6	1	0	2	9
ఎమ్మెల్యేల కోటా	4	1	0	2	7
గవర్నర్ కోటా	1	0	1	0	2
మొత్తం	11	2	1	4	18

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

నర్తు రామారావు
కుడిపూడి సూర్యనారాయణ
వంకా రవీంద్రనాథ్
కవురు శ్రీనివాస్
మేరుగ మురళీధర్
సిపాయి సుబ్రమణ్యం
పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి
ఎ.మధుసూదన్
ఎస్.మంగమ్మ

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

పెన్మత్స సూర్యనారాయణరాజు పెన్మత్స
పోతుల సునీత
కోలా గురువులు
బొమ్మి ఇజ్రాయెల్
జయమంగళ వెంకటరమణ
చంద్రగిరి ఏసురత్నం
మర్రి రాజశేఖర్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ప్రతిపాదించిన అభ్యర్థులు

కుంభా రవిబాబు
కర్రి పద్మశ్రీ

జిల్లా వార్తలు

ఆర్ఈఏసీ సభ్యుడిగా రాణాప్రతాప్



వైరా: వైరామండలంవల్లాపురానికి చెందిన తుమ్మల రాణాప్రతాప్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య తెలంగాణ జోన్ పరిశోధన విస్తరణ సలహామండలి(ఆర్ఈఏసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. అభ్యుదయ రైతుల కోటా నుంచి రాణాప్రతాప్‌ను సలహామండలి సభ్యుడిగా నియమించయగా, రెండేళ్ల పాటు ఆయన సభ్యుడిగా కొనసాగుతారు.

సాగులో ఆధునిక పరికరాలతో మేలు



వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

గుండాల: వ్యవసాయం రంగంలో ఆధునిక పరికరాల ఉపయోగంతో రైతులకు మేలు జరగడమే కాక సాగు విస్తీర్ణం పెరుగుతుందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మీనారాయణమ్మ అన్నారు. భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలంలోని రాయిపాడులో సోమవారం రైతులకు కేవీకే ఆధ్వర్యాన వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏటా పంటమార్పిడి చేసుకుంటేనే నాణ్యత గల విత్తనాలను ఎంపిక చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త శివ, ఎఫ్‌పీఓ చైర్మన్ పెండెకట్ల పాపారావుతో పాటు హుస్సేన్, సందీప్, రాజశేఖర్, ప్రవీణ్, కిరణ్, నర్సింహారావు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో ప్రతిభకు పదును

- సింగరేణి మణుగూరు ఏరియా జీఎం రాంచందర్
- మణుగూరులో కంపెనీ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



పరుగు పందెం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మణుగూరుటౌన్: పోటీతత్వంతో అంతర్గతంగా దాగి ఉండే ప్రతిభ మరింత మెరుగవుతుందని సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్ తెలిపారు. మణుగూరులోని భద్రాద్రి స్టేడియంలో సింగరేణి పాఠశాలల కంపెనీ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈమేరకు ఉదయం పతాకాన్ని ఎగురవేసిన పోటీలను ప్రారంభించిన జీఎం, సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో విజేతలకు పతకాలు అందజేశారు. ఈసందర్భంగా ముగింపు వేడుకల్లో జీఎం మాట్లాడుతూ మణుగూరులో గతంలోనూ కంపెనీ స్థాయి క్రీడాపోటీలు జరిగాయని, ఇప్పుడు మరోసారి అవకాశం దక్కడం ఆనందంగా ఉందని తెలిపారు. భావిభారత పౌరులైన విద్యార్థులు చదువుకే పరిమితంకాకుండా క్రీడల్లోనూ పాల్గొనాలని, తద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. సింగరేణీయులంతా ఒకే కుంటుంబమైనందున గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జీఎం సూచించారు.

220మందికి పైగా హాజరు

అథ్లెటిక్స్ మీట్‌కు సింగరేణి వ్యాప్తంగా ఎనిమిది ఏరియాల నుంచి 220మంది క్రీడాకారులు, పాఠశాలల సిబ్బంది హాజరయ్యారు. ఈమేరకు 100, 200, 400, 800, 1,500 మీటర్ల పరుగుపందెంతో పాటు షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో పోటీలు నిర్వహించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బంగారు, రజిత, కాంస్య పతకాలు అందజేశారు. ఈకార్యక్రమాల్లో ఏరియా ఏజీఎం డి.వెంకటేశ్వర్లు అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు, సంఘాల నాయకులు, ఎస్.రమేష్, శ్రీనివాసరావు, వెంకటరమణ, వీరభద్రం, డాక్టర్ శేషగిరిరావు, శ్రీనివాసరావు, వి.రామేశ్వరరావు, సింగు శ్రీనివాస్, పీ.బీ.అవినాష్, ఎం.డీ.మదార్‌సాహెబ్, సురేష్, ప్రవీణ్, స్వరూపరాణి, సుందర్‌రాజు, జాన్ వెస్లీ, అశోక్, రమేష్, కాపా శివాజీ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు పతకాలు అందజేస్తున్న జీఎం రాంచందర్

గురుకుల డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్య

గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్



గిరిజన దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఉమ్మడి జిల్లాలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తూనే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌సీఓ మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన స్టేషనరీపై ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. కొత్తగా నిర్మించే భవనాల టెండర్ ప్రక్రియ చివరి దశకు చేరినందున త్వరలోనే పనులు మొదలవుతాయని తెలిపారు. కాగా, విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఈ సమావేశంలో గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు రాజేశ్వరి, రోజా, స్వప్నకుమారి, ఉమాదేవి, గురుకులం సెఓ ఏఓలు నరేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు

అర్హులైన నిరుపేద గిరిజనులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ రమాదేవి సూచించారు. ఐటీడీఏ హాల్‌లో సోమవారం గిరిజన దర్బార్‌లో భాగంగా వారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయా యూనిట్ల అధికారులకు అందచేసి పరిష్కారంపై సూచనలు చేశారు. ఆతర్వాత ఏపీఓ, డీడీ మాట్లాడుతూ గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏతో పాటు వివిధ శాఖల అధికారులు భీం, సురేష్‌బాబు, శ్రీనివాస్, భాస్కరన్, ఆదినారాయణ, ప్రభాకర్‌రావు, దుర్గయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భాష, గణిత అభ్యాసాలపై దృష్టిపెట్టండి..



విద్యార్థులు చేసిన ప్రాజెక్టులతో రాజశేఖర్, ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: రాష్ట్రప్రభుత్వం ముద్రించిన భాష, గణిత పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని మౌళిక భాష, గణిత సామర్థ్యాల సాధన రాష్ట్ర పరిశీలకులు సళికినేని రాజశేఖర్ సూచించారు. సత్తుపల్లి పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన తరగతి గదిలో బోధన అభ్యాసనం, అభ్యాసన సామాగ్రి వినియోగంపై ఆరా తీశారు. అలాగే, వర్క్‌షీట్లు, ప్రాజెక్టు వర్క్‌లు, జవాబుపత్రాలను తనిఖీ చేశాక విద్యార్థుల భాష, నైపుణ్యాలపై ఆరా తీసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్య నోడల్ అధికారి ఎస్.రాజేశ్వరరావు, హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్, ఉపాధ్యాయులు నర్సింహారావు, పవన్, లాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా పథకాలపై మహామేళా

ఈనెల 24వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ ద్వారా అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించేందుకు గాను మహామేళా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించగా 24వ తేదీ వరకు కొనసాగనుంది. తపాలా శాఖలోని వివిధ పథకాలపై ఇటీవల పెంచిన వడ్డీరేట్లను వివరించి ఎక్కువమంది ప్రజలను చేర్పించడమే ఈ మహామేళా ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఖమ్మం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ రవికుమార్ ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, సిబ్బందితో సమావేశమై సూచనలు చేశారు. ఆర్థికంగా చేయూతనిచ్చే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఆన్‌లైన్‌లోనూ పోస్టల్ ఖాతాలు

పోస్టాఫీస్‌కు వెళ్లే పని లేకుండా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో పోస్టల్ ఖాతా తెరుచుకునే సౌకర్యాన్ని ఆ శాఖ కల్పించింది. పోస్టల్ ఖాతా కావాలనేకునే వారు పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా చిరునామా, తదితర వివరాలతో సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేయాలి. దీంతో పోస్ట్‌మ్యాన్ ఇంటి వద్దకు వచ్చి ఖాతా తెరవడంలో సహకరిస్తారు. ఆతర్వాత వివరాలను పోస్ట్‌మ్యాన్ పోస్టాఫీస్‌లో సమర్పిస్తే పాస్‌బుక్ ఖాతాదారుల ఇంటికి చేరుతుంది. ఇందుకోసం ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయబోమని అధికారులు తెలిపారు. ఇక ఇప్పటికే పోస్టాఫీస్‌లో సేవింగ్ ఖాతా కలిగిన వారికి ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా ఆర్డీ, ఎఫ్డీ, ఎస్ఎస్‌సీ, కేవీపీ ఖాతాలను తెరిచే సౌకర్యం కల్పించారు. ట్రోల్ ఫ్రీ నంబర్ 18002666868కు ఫోన్ చేస్తే ఖాతాలో మొత్తాన్ని చూసుకునే అవకాశం ఉంది.

నేటి నుంచి తునికాకు రెండో విడత టెండర్లు



అటవీ ప్రాంతంలో సేకరించనున్న తునికాకు

పాల్వంచరూరల్: ఏజెన్సీలో గిరిజనులకు నెల రోజుల పాటు ఉపాధి, అటవీ శాఖకు ఆదాయం తెచ్చిపెట్టే తునికాకు సేకరణకు కసరత్తు కొనసాగుతోంది. ఈమేరకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన మొదటి దశలో ఈనెల 6నుంచి 14వ తేదీ వరకు టెండర్లు ఆహ్వానించగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆరు డివిజన్లలోని ఒక యూనిట్‌లో కూడా అమ్ముడవలేదు. దీంతో రెండో విడతగా టెండర్లు స్వీకరించనున్నట్లు రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డీఎం పృథ్వీరాజ్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు టెండర్ దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, మార్కెట్‌లో తునికాకు సరైన డిమాండ్ లేకపోవడంతోనే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సమాచారం.

పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయి

బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం



గూడూరులోని ఎంజేపీ గురుకులంలో అధికారులు

గూడూరు: విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరడం సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం తెలిపారు. మహత్మా జ్యోతిబాపూలే గురుకులాల కార్యదర్శి మల్లయ్య బట్టు, వరంగల్ ఆర్సీఓ రాంరెడ్డితో కలిసి ఆయన సోమవారం రాత్రి గూడూరులోని ఎంజేపీ బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల భోజనాన్ని పరిశీలించి, ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా అని ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న తీరుపై ప్రశ్నలు వేసిసమాధానాలు రాబట్టారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్వేతతో పాటు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

జామాయిల్ ప్లాంటేషన్ నరికివేత

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ సమీప ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్‌లోని జామాయిల్ ప్లాంటేషన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారని ఎఫ్ఆర్వో బి.సురేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. దామరవంచ శివారు లక్ష్మీతండా సమీపాన 986 కంపార్ట్‌మెంట్‌లో రెండు హెక్టార్లలో జామాయిల్ ప్లాంటేషన్ వేయగా, ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 300జమాయిల్ మొక్కలను నరికేశారని పేర్కొన్నారు. ఈమేరకు ఎఫ్ఎస్ఓ ఇచ్చిన సమాచారంతో పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.